దిత్వా దూసుకొస్తోంది

వాయుగుండంగా మారిన అల్పపీడనం

● చెన్నైకి 600 కి.మీ.ల దూరంలో తుపాను ● రామేశ్వరంలో కుండపోత



మండపం తీరంలో ఎగసిపడుతున్న అలలు

చెన్నై, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకకు సమీపంలో నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం గురువారం మధ్యాహ్నం వాయుగుండంగా మారింది. ఆ వాయుగుండం ఉత్తర వాయువ్య దిశగా కదులుతూ తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. ఆ తుఫానుకు 'దిత్వా' అని నామకరణం చేశారు. ఈ తుపాను కంటే ముందు మలక్కా జలసంధి వద్ద ఏర్పడిన వాయుగుండం 'సెన్యార్' తుఫానుగా మారింది. దీని ప్రభావం రాష్ట్రంపై ఎలాంటి ప్రభావం చూపకపోయినా గాలుల కారణంగా చెదురుమదురుగా వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన 'దిత్వా' తుఫాన్ 48 గంటల్లో (29న)గా ఉత్తర - వాయువ్యదిశగా కదులుతూ ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి తీరాల వైపు కదులుతుందని వాతావరణ శాఖ అధికారి సెంథామరై కన్నన్ తెలిపారు. ప్రస్తుతం ఈ తుఫాన్ గురువారం అర్ధరాత్రి నగరానికి 600 కి.మీల దూరంలో కేంద్రీకృతమై ఉందని, గంటకు 15 కిలోమీటర్ల వేగంతో తీరం వైపు ప్రయాణించనుందని చెప్పారు. ఈ తుపాను కారణంగా చెన్నై, చెంగల్పట్టు, తిరువళ్లూరు, కడలూరు, విల్లుపురం, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, పుదుకోట, మైలాడుదురై జిల్లాల్లో ఓ మోస్తరుగా వర్షం కురుస్తుందన్నారు. తీవ్రరూపం దాల్చిన ఈశాన్యరుతుపవనాల ప్రభావం, తాజా తుఫాన్ కారణంగా డిసెంబర్ 2 వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుందని తెలిపారు. పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో రాబోవు రెండు రోజుల్లో ఓ మోస్తరు వర్షం కురుస్తుందని వివరించారు. రామనాధపురం, పుదుకోట, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, తదితర జిల్లాలో పెనుగాలులతో వర్షం కురుస్తుందన్నారు. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు తెలిపారు.



పాంబన్ చిన్నపాలం ప్రాంతంలో వీధుల్లో చేరిన వర్షపునీరు

పాంబన్ రేవులో మూడో నెంబర్ తుపాను సూచిక

రామేశ్వరం సముద్రతీర ప్రాంతాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం వేకువజాము వరకు పెనుగాలులతో కుండపోతగా వర్షం కురిసింది. దీంతో జనావాస ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. బుధవారం రాత్రంతా కురిసిన కుండపోత వర్షానికి రామేశ్వరం బస్టాండు ప్రాంతం, తంగచ్చిమఠం, రాజీవ్‌గాంధీ నగర్, మండపం, కలైంజర్ నగర్, అన్నానగర్ తదితర ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రామేశ్వరం రామనాధస్వామివారి ఆలయంలోనూ వర్షపు నీరు చొరబడటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రామేశ్వరం సముద్రతీరం పొడవునా పెనుగాలులు, రాక్షస అలలు తీరంవైపు ఎగసిపడుతుండటంతో గత మూడు రోజులుగా జాలర్లు చేపలవేటకు వెళ్ళలేదు. పాంబన్ రేవు వద్ద గురువారం సాయంత్రం మూడో నెంబర్ తుపాను సూచిక ఎగురవేశారు.

మూడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్...


శుక్రవారం తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం జిల్లాల్లో భారీగా వర్షం కురిసే అవకాశం ఉండటంతో ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఇదే రీతిలో రామనాధపురం, శివగంగ, పుదుకోట, మైలాడుదురై, కడలూరు, అరియలూరు జిల్లాలో ఒకటి రెండు ప్రాంతాల్లో వర్షం కురుస్తుందని వివరించారు. 29న చెన్నై, కాంచీపురం, రాణిపేట, తిరువణ్ణామలై, అరియలూరు, పెరంబలూరు, తంజావూరు జిల్లాలో భారీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. 30న తిరువళ్లూరు, కాంచీపురం, రాణిపేట జిల్లాల్లో పలుచోట్ల ఓ మోస్తరుగా వర్షం కురుస్తుందని ఆయన తెలిపారు. సముద్రతీరం పొడవునా గంటకు 40 నుండి 50 కి.మీల వేగంతో పెనుగాలులు వీస్తాయని, తీరం వైపు అలలు దూసుకు వస్తాయని, మత్స్యకారులు శుక్రవారం నుండి ఆదివారం వరకూ చేపలవేట మానుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

8 జిల్లాలకు రెడ్ అలర్ట్...

బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను కారణంగా ఈ నెల 29న చెంగల్పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుదురై, తిరువారూరు, నాగపట్టినం, పుదుచ్చేరి, కారైక్కాల్ జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, వేలూరు, రాణిపేట, తిరువణ్ణామలై, కళ్ళకురిచ్చి, పెరంబలూరు, అరియలూరు, తంజావూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు తెలిపారు.

సింహ వాహనంపై ఊరేగిన

అరుణాచలేశ్వరుడు



హంస వాహనంపై పరాశక్తి అమ్మ అమ్మవారు



సింహ వాహనంపై ఉన్నాములై సమేత అరుణాచలేశ్వరుడు

వేలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అగ్నిక్షేత్రమైన తిరువణ్ణామలైలో గత సోమవారం ప్రారంభమైన కార్తిక దీపోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో నాలుగో రోజైన గురువారం తెల్లవారుజామున సింహవాహనంపై ఉన్నాములై అమ్మవారి సమేత అన్నామలైయార్ ఉత్సవ మూర్తులను ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. అదేవిధంగా పంచమూర్తులైన గణపతి వెండి మూషిక వాహనంపై, వల్లి,దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి శేషవాహనంపై, పరాశక్తి అమ్మవారిని హంస వాహనంపై, ప్రత్యేక పల్లకీలో చండికేశ్వరుల ఉత్సవమూర్తులను ఊరేగించారు. మాడ వీధుల్లో ఊరేగుతున్న స్వామివారికి భక్తులు హారతులుపట్టారు. ఆలయ ప్రాంగణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



వెండి మూషిక వాహనంపై గణపతి, శేషవాహనంపై సుబ్రమణ్యస్వామి

ఈసారి 200 స్థానాలు మాకే

● జన్మదిన వేడుకల్లో ఉదయనిధి ధీమా ● రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే శ్రేణుల సంబరాలు



తనయుడిని ఆశీర్వదించి ముద్దాడుతున్న స్టాలిన్

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు డీఎంకేకు ప్రజల మద్దతు పెరుగుతోందని, వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో 200 స్థానాల్లో తాము విజయం సాధిస్తామని ఉపముఖ్యమంత్రి ఉదయనిధి ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఉదయనిధి 49వ జన్మదినం సందర్భంగా డీఎంకే నేతలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. పేదలకు సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. ఉదయనిధి ముందుగా ఉదయం 8గంటలకు మెరీనా బీచ్‌లో ఉన్న దివంగత మాజీ ముఖ్యమంత్రులు అన్నాదురై, కరుణానిధి స్మారక మందిరాలను సందర్శించి పుష్పాంజలి ఘటించారు. అక్కడ పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులకు ఆయన సంక్షేమ సహాయాలు పంపిణీ చేశారు. అక్కడినుండి వెప్పేరిలో ఉన్న ద్రావిడ పితామహుడు తంథై పెరియార్ మాలిగైకి వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉదయనిధి మీడియాతో మాట్లాడుతూ... తన పుట్టినరోజున ముందుగా రాష్ట్రాభివృద్ధి కోసం కృషిచేసిన నేతలకు నివాళులర్పించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. నాలుగున్నరేళ్ల డీఎంకే మోడల్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన పార్టీ నిర్వాహకులకు సూచించారు. పార్టీపట్ల చూపుతున్న ఆసక్తి మరో నాలుగైదు నెలలు అలాగే కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం అక్కడినుండి గోపాలపురంలో ఉన్న మాజీముఖ్యమంత్రి కరుణానిధి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం అనంతర అడయార్ గ్రీవేస్‌రోడ్డులోని 'కురింజి' హౌస్‌కు చేరుకున్న ఆయన తన తల్లిదండ్రుల ఆశీస్సులందుకుని, కుటుంబ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అదేవిధంగా ఉదయనిధికి శుభాకాంక్షలు తెలిపేందుకు డీఎంకే సీనియర్ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మేయర్లు, డిప్యూటీ మేయర్లు, డీఎంకే అనుబంధ విభాగాల నేతలు, డీఎంకే మిత్రపక్షాల నేతలు ఆయన నివాసం వద్ద బారులు తీరారు.



అభిమానులతో ఉదయనిధి కరచాలనం

ప్రముఖుల శుభాకాంక్షలు...

ఉదయనిధి జన్మదిన సందర్భంగా డీఎంకే ఎంపీలు కనిమొళి, దయానిధి మారన్, కళానిధి వీరాస్వామి, తిరుచ్చి శివ, రాష్ట్ర మంత్రులు పీకే.శేఖర్‌బాబు, అన్బిల్ మహేష్, కేవీ.చెళియన్, ఎం.సుబ్రమణ్యం, పొన్ముడి, టీఎం. అన్బరసన్, శివశంకరన్, గీతా జీవన్, ఎం.రఘుపతి, మక్కల్ నీదిమయ్యం అధ్యక్షుడు కమల్‌హాసన్ తదితరులు డిప్యూటీ సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసులు, న్యాయవాదుల ఘర్షణ వ్యవహారం...

కేసులన్నీ రద్దు చేసిన హైకోర్టు



పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు ప్రాంగణంలో పోలీసులు-న్యాయవాదుల ఘర్షణ వ్యవహారంపై నమోదైన అన్ని కేసులను రద్దు చేస్తున్నట్లు మద్రాసు హైకోర్టు ప్రకటించింది. 2009లో మద్రాసు హైకోర్టు విచారణకు హాజరైన బీజేపీ నేత సుబ్రమణ్యస్వామిపై దాడి చేసేందుకు కొంతమంది న్యాయవాదులు యత్నించారు. దీంతో వారిని అరెస్టు చేసే వ్యవహారంపై నెలకొన్న వాగ్వివాదం కాస్తా పోలీసులకు-న్యాయవాదులకు మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ సందర్భంగా హైకోర్టు ప్రాంగణంలో వున్న పోలీస్ స్టేషన్‌కు కొందరు నిప్పంటించారు. ఈ ఈ కేసు ఎగ్మూర్ కోర్టులో విచారణలో ఉన్న నేపథ్యంలో, కేసు రద్దు చేయాలని కోరుతూ 28 మంది న్యాయవాదులు, నలుగురు పోలీసు అధికారులు మద్రాసు హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై గత ఏప్రిల్‌లో విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ నిర్మల్ కుమార్ స్పందిస్తూ.. ఘర్షణ సమయంలో తానూ ఒక న్యాయవాదిగా ఉన్నానని, ఆ ఘటనల్ని తాను ప్రత్యక్షంగా చూశానని గుర్తు చేసుకున్నారు. ఇరువర్గాల వాదనల అనంతరం ఆయన తీర్పు వాయిదా వేశారు. గురువారం ఆ పిటిషన్లపై తీర్పు వెల్లడించారు. హైకోర్టులో జరిగిన ఘర్షణకు సంబంధించి పోలీసులు, న్యాయవాదులపై నమోదైన అన్ని కేసులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతేగాక.. 'ఆ ఘటనను మరచి ముందుకు సాగుదాం' అంటూ న్యాయమూర్తి తన తీర్పుకు ముక్తాయింపు పలికారు.

మా కూటమిలోకి మరిన్ని పార్టీలు

● అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి



మీడియాతో మాట్లాడుతున్న ఈపీఎస్

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే నాయకత్వం వహించే కూటమిలో మరిన్ని పార్టీలు చేరుతాయని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఆశాభావం వ్యక్తం చేశారు. రామనాథపురం సంస్థానం యువరాజు నాగేంద్ర సేతుపతి వివాహం గురువారం ఉదయం మదురై ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు మదురై చేరుకున్న ఈపీఎస్ కు అన్నాడీఎంకే నాయ కులు ఘనస్వాగతం పలికారు. వివాహం అనంతరం ఓ హోటల్‌లో దక్షిణాది జిల్లాల అన్నాడీఎంకే కార్యదర్శులు, మాజీమంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలతో ఈపీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రులు దిండుగల్ శ్రీనివాసన్, సెల్లూరు రాజు, ఆర్బీ ఉదయ్‌కుమార్, రాజ్యలక్ష్మి, ఎమ్మెల్యే రాజన్‌చెల్లప్ప తదితరులు హాజరయ్యారు. సమావేశంలో ఈపీఎస్ మాట్లాడుతూ... దక్షిణాది జిల్లాల్లో అన్నాడీఎంకే కంచుకోటగా ఉన్న నియోజకవర్గాలతో పాటు కొత్త నియోజకవర్గాల్లో కూడా పార్టీని గెలిపించేలా చర్యలు తీసుకోవల్సిందిగా సూచించారు.

ఆయన్నే అడగండి: ఈపీఎస్ విసుర్లు

ఈ సమావేశం అనంతరం బయటకు వచ్చిన ఈపీఎస్‌ను కలిసిన మీడియా ప్రతినిధులు..సెంగోట్టయ్యన్ వ్యవహారంపై స్పందించాలని అడగ్గా.. 'ఆ విషయం ఆయన్నే అడగండి. నన్ను అడిగితే ఎలా?' అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే నాయకత్వం వహించే కూటమిలో ఇప్పటికే బీజేపీ, తమిళ మానిల కాంగ్రెస్, పురచ్చి భారతం తదితర పార్టీలు ఉన్నాయని, త్వరలోనే మరికొన్ని పార్టీలు కూడా చేరే అవకాశముందన్నారు.

ఆలయాల్లో అభివృద్ధి పనులు

● ప్రారంభించిన సీఎం స్టాలిన్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పనులు ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 18 సుప్రసిద్ధ ఆలయాలకు సంబంధించిన 24 అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ అభివృద్ధి పనులకు రూ.75.94కోట్ల మేర నిధులు కేటాయించినట్లు ఆయన ప్రకటించారు. రూ.6.77 కోట్లతో ఐదు ఆలయాల్లో పూర్తయిన పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, తదితరులు పాల్గొన్నారు. ఇదే విధంగా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన మరొక కార్యక్రమంలో రూ.10.79 కోట్లతో నిర్మించిన భవనాలను ఆయన ప్రారంభించారు. అదే విధంగా రూ. 38.85 కోట్లతో నిర్మించనున్న కళాశాల విద్యార్థుల హాస్టల్ భవనాలకు శంకుస్థాపన చేశారు. ఆ శాఖలో విధి నిర్వహణలో మృతి చెందినవారి వారసులకు కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగ నియామక పత్రాలను కూడా ఆయన అందజేశారు.

టీవీకేలోకి సెంగోట్టయ్యన్

పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన విజయ్

వెంటనే కీలక పదవులు ● ఆయన సేవలు అవసరం



పార్టీలో చేరిన సెంగోట్టయ్యన్‌ను సత్కరిస్తున్న టీవీకే అధ్యక్షుడు విజయ్

చెన్నై, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) తీర్థం పుచ్చుకున్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ సమక్షంలో గురువారం ఆ పార్టీ సభ్యత్వం స్వీకరించారు. సెంగోట్టయ్యన్‌తోపాటు మాజీ ఎంపీ సత్యభామ, ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల సహా ఆయన అనుచరులు సుమారు 50 మంది టీవీకేలో చేరారు. ఐదు దశాబ్దాలపాటు అన్నాడీఎంకేలో కొనసాగిన సెంగోట్టయ్యన్ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)పై తిరుగుబావుటా ఎగురవేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం విజయ్‌తో రెండు గంటల పాటు భేటీ అయిన సెంగోట్టయ్యన్.. గురువారం టీవీకేలో చేరారు. ఉదయం 10 గంటలకు స్థానిక పనయూరులోని టీవీకే కార్యాలయం వద్ద విజయ్ సమక్షంలో ఆ పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా విజయ్ ఆయనను సత్కరించి, సెంగోట్టయ్యన్, ఆయన అనుచరులకు పార్టీ సభ్యత్వ కార్డులను అందజేశారు.

పార్టీ ప్రధాన సమన్వయకర్తగా..

టీవీకేలో చేరిన కొద్దిసేపటికే సెంగోట్టయ్యన్‌ను ఆ పార్టీ కార్యనిర్వాహక ప్రధాన సమన్వయకర్తగా నియమిస్తున్నట్లు విజయ్ ప్రకటించారు. అదే విధంగా ఈరోడ్, కోయంబత్తూరు, తిరుప్పూరు, నీలగిరి జిల్లాల వ్యవస్థాపక కార్యదర్శిగాను ఆయన పార్టీకి సేవలందిస్తారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సెంగోట్టయ్యన్ జేబులో 'అమ్మ' ఫొటో

టీవీకేలో చేరినప్పటికీ సెంగోట్టయ్యన్ జేబులో అన్నాడీఎంకే అధినేత్రి, దివంగత ముఖ్యమంత్రి జయలలిత ఫొటోనే వుంచుకున్నారు. సహజంగా రాష్ట్ర నేతలు ఏ పార్టీలో వుంటే ఆ పార్టీ అధినేత ఫొటో పెట్టుకోవడం ఆనవాయితీ. కానీ సెంగోట్టయ్యన్ మాత్రం ఇందుకు భిన్నంగా టీవీకేలో చేరినా జయ ఫొటో పెట్టుకోవడం చర్చనీయాంశమైంది. ఇదిలా వుండగా టీవీకే సభ్యత్వం పొందిన సెంగోట్టయ్యన్ ఆ పార్టీ సీనియర్ నేతలు బుస్సీ ఆనంద్, ఆదవ్ అర్జునా, పార్టీ శ్రేణులతో కలసి మెరీనాబీచ్‌లో ఉన్న మాజీ ముఖ్యమంత్రులు అన్నాదురై, ఎంజీఆర్ సమాధుల వద్ద నివాళులర్పించారు.



అన్నాదురై సమాధివద్ద టీవీకే నేతలతో కలిసి నివాళులర్పిస్తున్న సెంగోట్టయ్యన్

ఆయన అనుభవం అవసరం: విజయ్

సెంగోట్టయ్యన్ టీవీకేలో చేరటంపై విజయ్ ఓ వీడియో సందేశం వెలువరించారు. "మాజీ సీఎం లు ఎంజీఆర్, జయలలిత ప్రశంసలందుకుని ఐదు దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన నేత మా పార్టీలో చేరటం ఎంతో సంతోషంగా వుంది. ఆయన సుదీర్ఘ అనుభవం పార్టీకి మేలు చేస్తుం ది. సెంగోట్టయ్యన్ రాకతో మా పార్టీ బలం కూడా పెరిగింది" అని ఆ సందేశంలో పేర్కొన్నారు.

స్వచ్ఛమైన పాలన కోసమే టీవీకేలో చేరా: సెంగోట్టయ్యన్

రాష్ట్రంలోని ప్రజలంతా మార్పు కోరుకుంటున్నారని, స్వచ్ఛమైన పాలన కోసం ఎదురు చూస్తున్నారని తెలుసుకునే తాను టీవీకేలో చేరానని సెంగోట్టయ్యన్ స్పష్టం చేశారు. పనయూరులోని పార్టీ కార్యాలయం వద్ద మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డీఎంకే, అన్నాడీఎంకే వేర్వేరు పార్టీలు కావని, అందుకే తాను టీవీకేలో చేరానన్నారు. పార్టీలో చేరాలని డీఎంకే, బీజేపీ నుంచి ఎలాంటి ఆహ్వానం రాలేదన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన తర్వాతే టీవీకేలో చేరినట్లు వివరించారు. విజయ్ సుపరిపాలనను అందిస్తారనే నమ్మకం తనకుందని ఆయన చెప్పారు.

సమాచార దృష్టి

1న 'ఆలూరి రామస్వామి పూర్ణావతి తెలుగు చారిటబుల్ ట్రస్ట్' ప్రారంభం

చెన్నై, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే తెలుగు ప్రముఖురాలు, విద్యావేత్త, రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ ఏవీ శివకుమారి తన తల్లిదండ్రులైన ఆలూరి రామస్వామి, పూర్ణావతి పేరుతో చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. విస్తృత సామాజిక సేవా కార్యక్రమాల కోసం 'ఆలూరి రామస్వామి పూర్ణావతి తెలుగు చారిటబుల్ ట్రస్ట్'ను డిసెంబరు 1వ తేదీ ప్రారంభించనున్నారు. టి.నగర్ విజయరాఘవరోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో 1వ తేదీ సాయంత్రం 6 గంటలకు ట్రస్టు ప్రారంభోత్సవం జరుగనుంది. 'తానా' పూర్వాధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ తోటకూర ముఖ్య అతిథిగా హాజరై సంస్థను ఆవిష్కరించనున్నారు. మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించనున్న కార్యక్రమంలో తమిళనాడు ప్రభుత్వ మాజీ అదనపు ముఖ్య కార్యదర్శి టి.ప్రభాకరరావు గౌరవ అతిథిగా, ఇన్‌కం ట్యాక్స్ మాజీ ప్రిన్సిపల్ కమిషనర్ బి.మురళి విశిష్ట అతిథిగా, ఆస్కా కార్యదర్శి దిలీప్ కుమార్ ప్రత్యేక అతిథిగా హాజరుకానున్నారు. ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ శివకుమారి ట్రస్టు విధివిధానాలను వెల్లడించనున్నారు.

'టెట్' ఆన్సర్ కీ విడుదల

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఆన్సర్ కీ విడుదలైంది. కేంద్ర ప్రభుత్వ ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం, పాఠశాలల్లో 1 నుంచి 8వ తరగతి వరకు పనిచేస్తే సెకండరీ గ్రేడ్, డిగ్రీ ఉపాధ్యాయులు 'టెట్'లో తప్పక ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. ఈ పరీక్షను పేపర్-1, పేపర్-2 అని రెండు విభాగాలుగా నిర్వహిస్తుంటారు. ఈ ప్రకారం, 2025వ సంవత్సరానికి సంబంధించిన టెట్ పరీక్షలు ఈ నెల 15,16 తేదీల్లో నిర్వహించగా, రాష్ట్రవ్యాప్తంగా 3.70 లక్షల మంది పాల్గొన్నారు. పరీక్ష కీ ఆన్సర్‌ను టీఆర్బీ విడుదల చేసింది. ఈ విషయమై టీఆర్బీ అధ్యక్షులు ఎస్.జయంతి విడుదల చేసిన ప్రకటనలో... ఈ నెల 15న నిర్వహించిన టెట్ పేపర్-1కు 92,412 మంది, 16న నిర్వహించిన టెట్ పేపర్-2కు 3,31,923 మంది హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షల కీ ఆన్సర్‌ను వెబ్‌సైట్‌లో విడుదల చేశామన్నారు. దానిపై ఆక్షేపణలు తెలిపేవారు డిసెంబరు 3వ తేది సాయంత్రం 5.30 గంటల్లోపు తగిన ఆధారాలతో టీఆర్బీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జయంతి తెలిపారు.

షాలిమార్-చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైళ్ల పొడిగింపు

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): షాలిమార్-చెన్నై సెంట్రల్-షాలిమార్ మధ్య నడుపుతున్న ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... నెం.02841 షాలిమార్- చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు షాలిమార్‌లో డిసెంబరు 1,8,15,22,29 తేదీల్లో సాయంత్రం 6.30 బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.02842 చెన్నై సెంట్రల్-షాలిమార్ రైలు చెన్నై సెంట్రల్ నుంచి డిసెంబరు 3,10,17,23,31 తేదీ ల్లో తెల్లవారుజామున 4.30కి బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.20 గంటలకు షాలిమార్ చేరుకుంటుంది.

రామేశ్వరం-తిరుపతి ప్రత్యేక రైళ్లు...

రామేశ్వరం-తిరుపతి ప్రత్యేక రైలు (నెం.06080) రామేశ్వరంలో డిసెంబరు 2,9 తేదీల్లో సాయంత్రం 4.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 10.10 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06079 తిరుపతి-రామేశ్వరం ప్రత్యేక రైలు డిసెంబరు 3,10 తేదీల్లో తిరుపతిలో ఉదయం 11.55 గంటలకు బయల్దేరి మరుసటిరోజు వేకువజామున 4.45 గంటలకు రామేశ్వరం చేరుకుంటుంది. ఈ రైలు కుంభకోణం, శీర్గాళి, విల్లుపురం, తిరువణ్ణామలై, ఆరణి రోడ్డు, వేలూరు, కాట్పాడి, పాకాల మీదుగా నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

జల్లికట్టు ఎద్దులకు బీమా సౌకర్యం

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జల్లికట్టు ఎద్దులకు బీమా సదుపాయం అందుబాటులో ఉందని పశువైద్యులు వెల్లడించారు. ప్రభుత్వ బీమా సంస్థలు పశువులకు బీమా పథకాలు చేస్తున్నాయి. జల్లికట్టు ఎద్దులకు కూడా బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. రాష్ట్రంలో సుమారు లక్షకు పైగా జల్లికట్టు ఎద్దులు సంరక్షిస్తుండగా, వాటిలో 13 వేల ఎద్దులకు మాత్రమే బీమా చేశారు. ఈ విషయమై పశువైద్యులు డాక్టర్ బుద్ధన్ మాట్లాడుతూ... 3 నుంచి 8 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన జల్లికట్టు ఎద్దులను పశువైద్యుడి ధృవీకరణ పత్రం, మార్కెట్ విలువ ఆధారంగా బీమా చేసుకోవచ్చన్నారు. జల్లికట్టు ఎద్దుల ప్రస్తుత మార్కెట్ విలువలో 5 నుంచి 6 శాతం వార్షిక ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. బీమా విషయమై జల్లికట్టు ఎద్దులను సంరక్షిస్తున్న రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

కల్పాక్కంలో విద్యుదుత్పత్తి ప్రారంభం

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చెన్నై అణువిద్యుత్ కేంద్రంలో వార్షిక నిర్వహణ పూర్తికావడంతో, మళ్లీ విద్యుదుత్పత్తి ప్రారంభించారు. కల్పాక్కంలో చెన్నై అణువిద్యుత్ కేంద్రంలో, తలా 220 మెగావాట్ల సామర్థ్యం కలిగిన, యూనిట్-1, యూనిట్-2లో విద్యుదుత్పత్తి జరుగుతోంది. 2018లో యూనిట్-1లో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా ఉత్పత్తి నిలిపివేశారు రెండవ యూనిట్‌లో కూడా సాంకేతిక సమస్యలు తలెత్తి జనవరి 31వ తేది ఉత్పత్తి నిలిపివేసి, మరమ్మతుల అనంతరం మార్చి 2వ తేది నుంచి ఉత్పత్తి ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, వార్షిక నిర్వహణ పనుల కారణంగా సెప్టెంబరు 1వ తేది నుంచి ఉత్పత్తి నిలిపివేశారు. పనులు పూర్తికావడంతో బుధవారం నుంచి రెండవ యూనిట్‌లో విద్యుదుత్పత్తి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

ఈసీఆర్-ఓఎంఆర్ మధ్య హై లెవల్ ఫ్లై ఓవర్

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈసీఆర్-ఓఎంఆర్ రోడ్లు అనుసంధానం చేస్తూ హై లెవల్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి ఆమోదం లభించింది. తమిళనాడు కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ, ఈ హై లెవల్ ఇనుప ఫ్లై ఓవర్ నిర్మాణాలకు అనుమతి మంజూరు చేసింది. ఓఎంఆర్-ఈసీఆర్ మధ్య 11 కి.మీ మధ్య ఎక్కడ అనుసంధాన రోడ్లు లేకపోవడంతో, కొత్త వంతెన ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఆ ప్రకారం, ఈ ఫ్లై ఓవర్‌కు రూ.204 కోట్లతో ప్రాజెక్ట్ నివేదిక తయారుచేశారు. ప్రస్తుతం ఈ ఫ్లై ఓవర్‌కు అనుమతి లభించడంతో, త్వరలో టెండర్లు ఆహ్వానించి సంస్థను ఎంపిక చేసి పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

కీలడి సమీపంలో బయల్పడిన ప్రాచీన విగ్రహాలు

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా కీలడి సమీపంలోని అంబలత్తాడి గ్రామంలో చేపట్టిన తవ్వకాల్లో పాండ్యరాజుల కాలంనాటి దేవతా మూర్తుల విగ్రహాలు బయల్పడ్డాయి. మదురై కామరాజర్ విశ్వవిద్యాలయం పరిశోధన విద్యార్థుల బృందం అంబలత్తాడి గ్రామంలో తవ్వకాలు చేపట్టారు. ఇందులో గురువారం ఉదయం 12వ శతాబ్దానికి చెందిన పాండ్యరాజుల కాలనాటి శిలాఫలకం, పెరుమాళ్, శ్రీదేవి, భూమిదేవి, గరుడాళ్వార్ తదితర 10 దేవతామూర్తుల విగ్రహాలు బయటపడ్డాయి. వీటిని పరిశీలించిన విద్యార్థులు ఈ కళాఖండాలు పాండ్యరాజుల హయాంలో చెక్కినవని, చతుర్వేది అనే ప్రాంతాన్ని కేంద్రంగా పాండ్యరాజులు పాలన వ్యవహారాలు నిర్వహించినట్లు లభ్యమైన శిలాఫలకాల్లో స్పష్టంగా ఉందని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న పెరుమాళ్ విగ్రహం చేతుల్లో శంఖు, చక్రాలున్నాయి. శ్రీదేవి, భూదేవి విగ్రహాలు, కిరీటంతో కూడిన గరుడాళ్వార్ విగ్రహాలు దాదాపు 60 శాతానికి పైగా ధ్వంసమైనట్లు విద్యార్థులు తెలిపారు.



తవ్వకాల్లో బయల్పడిన 800 ఏళ్లనాటి విగ్రహాలు

పట్టపగలు టీచర్‌ను హతమార్చిన ప్రియుడు

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లాలో పట్టపగలు టీచర్‌ను హతమార్చిన ప్రియుడి పోలీసులకు లొంగిపోయాడు. ఆలంగుడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కావ్య (26) తాత్కాలిక ఉపాధ్యాయరాలిగా పనిచేస్తోంది. ఆమె గురువారం పాఠశాలకు వెళ్తుండగా కల్లికుప్పం ప్రాంతంలో ఆమె వెనుకగా వచ్చిన వ్యక్తి ఆమెతో వాగ్వివాదానికి దిగాడు. హఠాత్తుగా ఆ వ్యక్తి, తన దుస్తుల్లో దాచిన కొడవలి, కత్తితో కావ్యపై తీవ్రంగా దాడిచేశాడు. ఆమె కుప్పకూలిన తరువాత అతడు పారిపోయాడు. ఈ ఘటనలో కావ్య అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు చేపట్టిన ప్రాథమిక విచారణలో... కావ్యను హతమార్చింది ఆమె మాజీ ప్రియుడు అజిత్‌కుమార్ అని తెలిసింది. ప్రస్తుతం, కావ్యకు మరో వ్యక్తితో వివాహం నిశ్చయమైన నేపథ్యంలో, 13 ఏళ్లుగా ఆమెను ప్రేమిస్తున్న అజిత్ కుమార్, ఈ దారుణానికి పాల్పడ్డాడని తెలిపింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు అజిత్ కుమార్ కోసం గాలిస్తున్న నేపథ్యంలో, తంజావూరు తాలూకా పోలీస్ స్టేషన్‌లో అజిత్ కుమార్ లొంగిపోయాడు.

ఘనంగా ఉదయనిధి జన్మదిన వేడుకలు



అన్నదాన కార్యక్రమంలో డీఎంకే నాయకులు

తిరుత్తణి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు పట్టణ కార్యదర్శి సీజే.సెంథిల్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు పళ్లిపట్టు బజార్‌రోడ్డులోని దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ప్రజలకు స్వీట్లు పంచి, మధ్యాహ్నం 12 గంటలకు పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు ఎస్.మణిమేగళై, నిర్వాహకుల సమక్షంలో సుమారు వంద మంది పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పళ్లిపట్టు ఉప కార్యదర్శి విజయాలు, కౌన్సిలర్లు వి.చిరంజీవి, కె.మురళీ, ఎస్.మోహన్‌రాజ్, యువజన విభాగం కార్యదర్శి ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

వేలూరు జిల్లాలో...



కట్ చేస్తున్న డీఎంకే నాయకులు

డిప్యూటీ సీఎం ఉదయనిధి జన్మదినాన్ని పురస్కరించుకుని వేలూరు జిల్లా అనైకట్టు డీఎంకే నిర్వాహకులు గురువారం ఉదయం సంబరాలు జరుపుకున్నారు. అనైకట్టు యూనియన్ కార్యదర్శి వెంకటేశన్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో తూర్పు యూనియన్ కార్యదర్శి కుమారపాండ్యన్ కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంకే నిర్వాహకులు భాస్కరన్, సారధి, పురుషోత్తమన్, కార్తిక్, కన్నన్, హరిప్రసాద్, మేఘనాథన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్జన కేసు నుంచి మంత్రి పెరియకరుప్పన్‌కు విముక్తి



సహకారశాఖ మంత్రి పెరియకరుప్పన్

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్రమార్జన కేసు నుండి సహకార శాఖ మంత్రి పెరియకరుప్పన్, ఆయన కుటుంబ సభ్యులను విడుదల చేస్తూ శివగంగ జిల్లా మేజిస్ట్రేట్ కోర్టు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. 2006 నుండి 2011వ సంవత్సరం వరకు పెరియకరుప్పన్ హిందూ దేవాదాయశాఖ మంత్రిగా వ్యవహరించి ఆదాయానికి మించి రూ.1.2కోట్లు మేరకు ఆస్తులు వెనకేసుకున్నారని ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసుకు సంబంధించిన విచారణ పూర్తికావడంతో న్యాయస్థానం మంత్రికి విముక్తి కల్పిస్తూ తీర్పునిచ్చింది.

ఎడప్పాడి ద్రోహం చేయడం వల్లే కేఏఎస్ పార్టీ వీడారు

● మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం

అడయార్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి చేసిన ద్రోహం వల్లే ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ (కేఏఎస్) పార్టీ వీడారని రాష్ట్ర మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వ ఆరోపించారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ, ఎంజీఆర్ వెంట ఉన్న నేత, జయలలితకు అత్యంత విశ్వాసపాత్రుడుగా ఉన్న సీనియర్ నేత కేఏఎస్ పార్టీని వీడటానికి ప్రధాన కారణం ఎడప్పాడి మాత్రమేనని, ఆయన చేసిన ద్రోహం వల్లే పార్టీకి దూరమయ్యారన్నారు. నటుడు విజయ్ 'సర్కార్' సినిమా కోసం అనేక మంది ఆర్టిస్టులను పిలిపించారని, అదేవిధంగా ఇపుడు తన ప్రచార సభలకు పలు ప్రాంతాల నుంచి అభిమానులు, కార్యకర్తలను పిలిపిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రజల కోసం విశ్వాసంగా పని చేస్తున్నారన్నారు. నటుడు విజయ్ మాయాలోకంలో విహరిస్తున్నారన్నారు.

అన్నాడీఎంకే హిమాలయ పర్వతం.. దానిని కదిలించడం అసాధ్యం

● మాజీ డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హిమాలయ పర్వతంలాంటి అన్నాడీఎంకేను కదిలించడం ఎవ్వరితరం కాదని మాజీ డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్ పేర్కొన్నారు. కోవైలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ, తమిళ సినీ రంగంలో చక్రం తిప్పిన ఎంజీఆర్ డీఎంకే నుండి వైదొలిగి అన్నాడీఎంకే స్థాపించి వరుస విజయాలు సాధించి చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఆయన బాటలోనే పయనించిన జయలలిత కూడా అన్నాడీఎంకేను బలోపేతం చేసేందుకు కృషిచేసి ముందుకు నడిపించారన్నారు. అన్నాడీఎంకేను ప్రారంభించినప్పటి నుండే ఎన్నో ఆటుపోట్లు ఎదురైన సమయాల్లో కూడా పలువురు సీనియర్లు పార్టీని వదిలివెళ్లారని ఎంత మంది వెళ్లినా అన్నాడీఎంకే కృంగిపోలేదని, 2026లో తప్పనిసరిగా ఈపీఎస్ నేతృత్వంలో అన్నాడీఎంకే అధికారంలోకి వస్తుందన్నారు.

సమస్యల పరిష్కారం కోసం గ్రామస్తుల వినూత్న నిరసన



రోడ్డుపై మొక్కలు నాటి నిరసన తెలుపుతున్న మహిళలు

తిరువళ్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం గ్రామస్తులు వినూత్న నిరసన చేపట్టారు. జిల్లాలోని వతత్తూర్ పంచాయతి కందిగై గ్రామంలో సుమారుగా వంద పైగా కుటుంబాలున్నాయి. ఇక్కడ నుంచి విద్యార్థులు సుమారు 2 కిలో మీటర్లు నడిచి పాఠశాలకు వెళ్ళాల్సి వుంది. అలాగే కందిగై గ్రామం నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు కాలినడకన, ద్విచక్ర వాహనాలపై వెళ్ళాల్సి వస్తుంది. 30 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు వర్షాలతో పూర్తిగా దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అదే విధంగా, శ్మశాన వాటికకు వెళ్ళేందుకు రోడ్డు సరిగా లేకపోగా, అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు మధ్యలో పంట కాలువ ఉండటంతో ఎవరైన మరణిస్తే మోకాలి లోతు నీటిలో వెళ్ళి అంత్యక్రియలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇచ్చిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామం రోడ్డు మర్మమత్తులు, బస్సు సౌకర్యం, రేషన్ దుకాణం, కాలువపై వంతెనలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తు రోడ్డుపై మొక్కలు నాటి వినూత్న నిరసన తెలిపారు.

అన్‌లోడింగ్ కార్మికుల సమ్మె

తిరువళ్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా వినియోగదారుల సరకుల కార్పొరేషన్‌లోని ఏడు గిడ్డంగుల్లో పనిచేస్తున్న కార్మికులు గురువారం సమ్మె బాట పట్టగా, సరుకుల రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తిరువళ్లూరు జిల్లా వినియోగదారుల సరకుల కార్పొరేషన్ కార్మికుల సంఘంలో 300 మందికిపైగా కార్మికులు తమ దీర్ఘకాల డిమాండ్ల సాధనపై గురువారం సమ్మెకు దిగారు. దీంతో జిల్లాలోని ఏడు గిడ్డంగుల్లో సరకుల రవాణా పూర్తిగా నిలిచి పోయింది. ఈ సమ్మెకు సంఘ రాష్ట్ర కోశాధికారి భాస్కరన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల యూనియన్ ఎన్నికలను వెంటనే నిర్వహించాలన్నారు. తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సరకుల రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడగా, కార్మికులతో చర్చలు జరిపి త్వరితగతిన సరకుల రవాణాను పునరుద్ధరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

30న బాలల క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక

● జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడు సంపత్ ప్రకటన



వేలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా బాలల క్రికెట్ పోటీలకు ఎంపిక కార్యక్రమం జరుగనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడు, నరువి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వ్యవస్థాపకుడు సంపత్ తెలిపారు. 12యేళ్ల పిల్లలు దీనికి అర్హులని, ఆసక్తి గలవారు ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్‌తో పాటు పూర్తి వివరాలతో వేలూరు కొత్త బైపాస్‌రోడ్డులో ఉన్న రాజేశ్వరి గార్డెన్స్ ఆవరణలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన ప్రకటించారు. వివరాలకు జిల్లా క్రికెట్ సంఘ గౌరవ కార్యదర్శి శ్రీధరన్ మొబైల్ నెంబర్ 7010594657 ను సంప్రదించాలని ఆయన సూచించారు.

వీపీ సింగ్ లాంటి నేతను మళ్లీ చూడబోం

● సీఎం స్టాలిన్ ప్రశంస

అడయార్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ (వీపీసింగ్) స్మారక వేడుకలను పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సామాజిక మాధ్యమంలో ఓ ట్వీట్ చేశారు. సామాజిక న్యాయాన్ని ఉన్నత లక్ష్యంగా భావించిన వ్యక్తి వీపీ సింగ్ అంటూ ప్రశంసలు కురిపించారు. తమిళనాడుకు, ఆయనకు మధ్య సంబంధాలున్నతమైనవన్నారు. 2023లో ఇదే రోజున (నవంబరు 27న) ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించినట్టు గుర్తు చేశారు. ఈడబ్ల్యూస్, నీట్ అంటూ పలు మార్గాల్లో సామాజిక న్యాయాన్ని పాతిపెడుతున్న పాలకులు కేంద్రంలో ఉండగా, వీపీ సింగ్ వంటి నేతను చూడబోమన్నారు.

పుళల్ చెరువు నుంచి నీటి విడుదల

అడయార్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడం, ఇది తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో పుళల్ చెరువు నుంచి నీటిని జలవనరుల శాఖ అధికారులు విడుదల చేశారు. ఈ తుపాను ప్రభావంతో కురిసే వర్షాలకు చెరువులోకి నీరు చేరే అవకాశం ఉండటంతో చెరువు కట్టల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్తగా ఉపరితల నీటిని విడుదల చేశారు. నీటి విడుదల కారణంగా వడక్కరై, గ్రాండ్‌లైన్, సామియార్‌మఠం, తండల్కళని, బాబా నగర్, వడ పెరుంబాక్కం, మనలి, కొసంబూరుతో సహా 10 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.

● కరూర్ దుర్ఘటన వ్యవహారం..

మృతుల కుటుంబీకుల విచారణ



సీబీఐ విచారణకు వెళ్తున్న మృతుల కుటుంబీకులు

చెన్నై, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో టీవీకే నేత విజయ్ జరిపిన రోడ్‌షో సందర్భంగా తొక్కిసలాటలు జరిగి 41 మంది మృతి చెందిన సంఘటనపై విచారణ జరుపుతున్న సీబీఐ మృతుల కుటుంబాలను గురువారం ఉదయం విచారణ ప్రారంభించారు. తొక్కిసలాటలో మరణించిన తొమ్మిది మంది కుటుంబీకులను, వారి స్నేహితుల వద్ద సీబీఐ అధికారులు గురువారం ఉదయం విచారణ జరిపారు.

9న ఓటర్ల జాబితా విడుదల

● కలెక్టర్ ప్రతాప్

తిరువళ్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఇప్పటి వరకు సేకరించిన ఓటర్ల జాబితాను అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో డిసెంబర్ 9వ తేది ప్రచురించనున్నట్లు కలెక్టర్ ప్రతాప్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై గురువారం కలెక్టర్ ప్రతాప్ అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ పనులను వేగవంతం చేయాలని, అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంబత్తూరు నియోజక వర్గంలో మొత్తం ఓటర్లు 3,74,000



సమావేశంలో మాట్లాడుతున్న మాట్లాడుతున్న కలెక్టర్

కాగా, అందులో 1,69,000 మందికి సంబంధించిన ఎస్ఐఆర్ ఫారాలను పూరించడంతో 45.32 శాతం పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన ఓటర్ల వివరాలను 5 రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. రానున్న శని, ఆది, సోమవారాల్లో తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టి గడువులోపు ఎస్ఐఆర్ ఫారాల పనులను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆవడి కార్పొరేషన్ కమిషనర్ శరణ్య, కార్పొరేషన్ ఇంజనీర్ రవిచంద్రన్, డిప్యూటీ కమిషనర్ చారిచెల్వి, అసిస్టెంట్ ఓటరు నమోదు అధికారులు, తహసిల్దార్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటివాడైన క్రికెటర్ అనిరుద్ధ శ్రీకాంత్



పెళ్లి పీటలపై నూతన వధూవరులు

అడయార్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ క్రికెటర్ కృష్ణమాచార్య శ్రీకాంత్ తనయుడు, క్రికెటర్, వ్యాఖ్యాత అనిరుద్ధ శ్రీకాంత్ ఓ ఇంటివాడయ్యారు. బిగ్‌బాస్ ఫేం, సినీ నటి సంయుక్త షణ్ముగనాథన్‌ను ఆయన గురువారం వివాహం చేసుకున్నారు. వీరి వివాహానికి ఇద్దరి కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగింది. బిగ్‌బాస్ షోతో పాపులరైన సంయుక్త ఇటీవల వచ్చిన 'మద్రాస్ మాఫియా' అనే చిత్రంలో పోలీస్ అధికారిణిగా నటించారు. ఈ యేడాది ఆగస్టు నుంచి అనిరుద్ధ తాను డేటింగ్‌లో ఉన్నట్టు సోషల్ మీడియా ద్వారా వెల్లడించగా ఎట్టకేలకు మూడుముళ్ళ బంధంతో వారిద్దరు ఒక్కటయ్యారు. తమ పెళ్ళి ఫోటోలు, వీడియోను సోషల్ మీడియా ఖాతాలో వారు షేర్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు సామాజిక మాధ్యమం వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ఫుట్ బోర్డుపై ప్రయాణిస్తే కఠిన చర్యలు

● దక్షిణ రైల్వే

అడయార్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సబర్బన్, ఎమ్మార్టీఎస్ రైళ్లలో ఫుట్ బోర్డులో ప్రయాణం, సాహస కార్యాలు చేపట్టేవారిపై కఠిన చర్యలు చేపడతామని దక్షిణ రైల్వే హెచ్చరించింది. ఈ మేరకు చెన్నై రైల్వే డివిజన్ విడుదల చేసిన ప్రకటనలో... నగరంలో నడుపుతున్న సబర్బన్, ఎమ్మార్టీఎస్ రైళ్లలో విద్యార్థులు ఫుట్ బోర్డులపై ప్రయాణిస్తూ ప్రయాణికులను ఇబ్బందులు గురిచేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. అలాగే, కొందరు విద్యార్థులు వెళ్తున్న రైలు బోగీలపై నిలబడి ప్రయాణించడం, సాహసాలు చేయడం వంటివి చేస్తున్నట్లు గుర్తించారు. ఈ చర్యలు అడ్డుకొనేలా సబర్బన్, ఎమ్మార్టీఎస్ రైల్వే స్టేషన్లలో భద్రత కట్టుదిట్టం చేశామన్నారు. అలాంటి చర్యలు పాల్పడే వారిపై '139' అనే నెంబరుకు ఫిర్యాదు చేయాలని, సంబంధిత విద్యార్థులు, వ్యక్తులపై కఠిన చర్యలు చేపడతామని చెన్నై రైల్వే డివిజన్ హెచ్చరించింది.

ప్రధానికి హత్యా బెదిరింపు

● రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీకి డీఎంకే జిల్లా కార్యదర్శి హత్యా బెదిరింపులకు పాల్పడిన వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ నోటీసులు జారీచేసింది. తెన్‌కాశి దక్షిణ జిల్లా డీఎంకే కార్యదర్శిగా వ్యవహరిస్తున్న జయపాలన్ ఇటీవల నిర్వహించిన ధర్నాలో బీజేపీ నేతలను తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా, ప్రధాని మోదీని ఘాటుగా విమర్శించడంతో పాటు హత్యా బెదిరింపులు చేస్తూ మాట్లాడారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వెలువడింది. ప్రధాని మోదీ గురించి అసభ్యంగా మాట్లాడ్డంతో పాటు హత్యా బెదిరింపులకు దిగిన జయపాలన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా, ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేనందున కేసు దర్యాప్తు ముగించినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ప్రభుత్వ సమాధానంతో సంతృప్తి చెందని హైకోర్టు.. ఈ వ్యవహారంలో ఏం చర్యలు తీసుకున్నారో వివరాలు సమర్పించాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

శబరిమలలో రాష్ట్ర వాసి మృతి

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శబరిమల వెళ్లిన రాష్ట్ర భక్తుడు మృతిచెందాడు. కోయంబత్తూర్‌కు చెందిన మురళి (50) శబరిమలలో హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయి మృతిచెందారు. ఈ వ్యవహారంపై పోలీసులు జరిపిన ప్రాథమిక విచారణలో... గుండెపోటు కారణంగా మురళి మృతిచెందాడని నిర్ధారించారు. కాగా, ఇప్పటివరకు శబరిమలలో గుండెపోటు కారణంగా 9 మంది భక్తులు మృతిచెందారు.

లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి 44 ఏళ్ల జైలు

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో 12 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి కోర్టు 44 ఏళ్ల జైలుశిక్ష విధించింది. భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేసే గుమ్మిడిపూండి ప్రాంతానికి చెందిన చంద్రన్ (65) గత 2021లో ఓ ఇంట్లో ప్రవేశించి 12 బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన గుమ్మిడిపూండి పోలీసులు, చంద్రన్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ కేసు తిరువళ్లూర్ జిల్లా పోక్సో కోర్టులో సాగుతోంది. ఈ కేసు విచారణ ముగిసిన నేపథ్యంలో నిందితుడు చంద్రన్‌కు 44 ఏళ్ల జైలు శిక్ష రూ.52 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఉమామహేశ్వరి తీర్పునిచ్చారు. అలాగే, బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేశారు.

మెరీనా బీచ్ అభివృద్ధిపై ఆసక్తి లేదు: హైకోర్టు

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్ అభివృద్ధిపై ఆసక్తి లేదని మద్రాసు హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. మెరీనా బీచ్‌లో రోడ్డు పక్కన వ్యాపారాల నియంత్రించడంపై దాఖలైన కేసు బుధవారం హైకోర్టు విచారణకు వచ్చింది. ఈ కేసు విచారించిన న్యాయమూర్తులు, పిటిషన్‌కు సంబంధించి అధికారులు అఫిడవిట్ దాఖలుచేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.. అలాగే, మెరీనా బీచ్ అభివృద్ధికి ఆసక్తి చూపడం లేదని, ఎలాంటి ఉత్తర్వులు జారీచేసినా, అధికారులు అమలుచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌పై పర్యావరణ, అటవీ శాఖల కార్యదర్శులు, చెన్నై కార్పొరేషన్ కమిషనర్ డిసెంబరు 10వ తేది నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

రేపు డీఎంకే ఎంపీల సమావేశం

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎంపీల సమావేశం శుక్రవారం జరుగనుంది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ విడుదల చేసిన ప్రకటనలో... సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లో రాష్ట్రానికి సంబంధించిన సమస్యలు, కేంద్ర నుంచి రావాల్సిన నిధులు తదితరాలపై పార్టీ ఎంపీలు ప్రస్తావించనున్నారన్నారు. ఈ క్రమంలో, ఎంపీలకు తగిన సూచనలు చేసేందుకు పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో తేనాంపేటలోని అన్నా అరివాలయంలో శుక్రవారం సమావేశం జరుగుతుందని దురై మురుగన్ తెలిపారు.

82యేళ్ల వృద్ధుడికి అరుదైన శస్త్ర చికిత్స

వేలూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని క్రిస్టియన్ మెడికల్ కళాశాల (సీఎంసీ)ఆస్పత్రిలో గురువారం ఉదయం గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 82యేళ్ల వృద్ధుడికి అరుదైన ట్రాన్స్‌కాథెటర్ మిట్రల్ వేల్వ్ రీప్లేస్‌మెంట్ (టీఏవీఆర్) చికిత్సను విజయవంతంగా పూర్తిచేసినట్లు ఆస్పత్రి యాజమాన్యం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆస్పత్రి యూనిట్-2 అధ్యక్షుడు డాక్టర్ జాన్‌జోస్ ఏర్పాటు చేసిన సమావేశంలో.. ఇప్పటివరకు తమ ఆస్పత్రిలో ఎన్నో రకాల గుండె సంబంధిత చికిత్సలను విజయవంతంగా పూర్తిచేశామని, అదేవిధంగా విదేశాల్లో కూడా క్లిష్టమైన టీఏవీఆర్ చికిత్సను తమ ఆస్పత్రి వైద్య సిబ్బంది సులభంగా పూర్తిచేయగలిగిందని తెలిపారు. అనంతరం వైద్యులను ఆయన ఘనంగా సత్కరించారు.

'కుట్రాలం'లో స్నానాలకు అనుమతి



పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): కుట్రాలం జలపాతంలో ఆరు రోజుల అనంతరం గురువారం నుంచి పర్యాటకుల స్నానాలకు అనుమతించారు. తెన్‌కాశి జిల్లావ్యాప్తంగా కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కుట్రాలం జలపాతాల వద్ద నీటి రాక అధికమైంది. ఈ కారణంగా పర్యాటకులు, అయ్యప్ప భక్తులు స్నానాలు చేసేందుకు అనుమతించలేదు. ఈ క్రమంలో, వర్షాలు తగ్గి జలపాతాల వద్ద నీటి ఉధృతి తగ్గడంతో, ప్రధాన జలపాతం మినహా పులిఅరువి, సిట్రురువి, ఐందరువి తదితర జలపాతాల్లో పర్యాటకుల స్నానాలకు అనుమతించారు. ప్రధాన జలపాతంలో మహిళలు స్నానం చేసే ప్రాంతంలో ఏర్పాటుచేసిన రక్షణ గోడలు నీటి ఉధృతికి కొట్టుకుపోయాయి. ఆ ప్రాంతంలో కొత్త గోడలు ఏర్పాటుచేయడంతో, ఆరు రోజుల అనంతరం ప్రధాన జలపాతంలో స్నానాలకు అనుమతిస్తున్నట్లు జిల్లా యంత్రాంగం గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

చిత్రజ్యోతి

కొన్నిసార్లు మాకు మేమే మోసం చేసుకుంటాం

● దర్శకుడు లింగుస్వామి



ఏ దర్శకుడు కూడా అభిమానులను మోసం చేయడానికి సినిమాలు రూపొందించరని, కొన్నిసార్లు మాకు మేమే మోసం చేసుకుంటామని ప్రముఖ దర్శకుడు ఎన్. లింగుస్వామి అన్నారు. 2014లో సూర్య - సమంత జంటగా లింగుస్వామి తెరకెక్కించిన 'అంజాన్' మూవీ రీ-ఎడిట్ చేసి ఈ నెల 28న రీ-రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దర్శకుడు లింగుస్వామి మాట్లాడుతూ, "తిరుపతి బ్రదర్స్' నిర్మాణ సంస్థ ఎన్నో వరుస విజయాలను అందించింది. కొన్నిసార్లు ఈ విజయాలు కూడా కొంతమందిని కోపంగా, ద్వేషంగా, అసూయపడేలా చేస్తాయి. 'అంజాన్' మూవీ అనుకున్న స్థాయిలో విజయంసాధించలేదు. 11 యేళ్ళ తర్వాత ఈ చిత్రం మరోసారి ప్రేక్షకుల ముందుకురానుంది. అప్పట్లో ఈ సినిమా విడుదలైనపుడు ఎంతోమంది నన్ను ట్రోల్ చేశారు. కానీ, నేను ఏ ఒక్కరినీ తప్పుపట్టడం లేదు. తొలుత ఈ మూవీ నిడివి 2 గంటల 36 నిమిషాలుండేది. ఇపుడు 36 నిమిషాలు తగ్గించడంతో పాటు రీ-ఎడిట్ చేసి రిలీజ్ చేస్తున్నాం. హీరో సూర్యను ఆయన అభిమానులు ఏ విధంగా చూడాలని అనుకున్నారో ఆ విధంగా చూపించాను. ఇపుడు నేను భయపడటం లేదు. 36 నిమిషాలు తొలగించి, కేవలం సూర్యపై మాత్రమే ఫోకస్ చేశాం. ఇపుడు ఈ సినిమా అందరికీ నచ్చుతుందన్న నమ్మకం ఉంది. సూర్య ఫ్యామిలీకి కూడా రీఎడిట్ చేసిన చిత్రం బాగా నచ్చింది. అభిమానులు కూడా దీన్ని ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. అదేసమయంలో నేను కూడా గతంలో తప్పు చేశాను. ఈ విషయాన్ని ప్రేక్షకులు నిర్మొహమాటంగా, నిజాయితీగా చెప్పారు. దీన్ని నేను అంగీకరించాను. మేము అభిమానులను మోసం చేయడానికి సినిమాలు తీయడం లేదు. కొన్నిసార్లు మనల్ని మనమే మోసం చేసుకుంటాం' అని లింగుస్వామి పేర్కొన్నారు.

హీరోయిన్లకు ప్రాధాన్యత తక్కువ



● మాళవికా మోహనన్

సాధారణంగా స్టార్ హీరోల చిత్రాల్లో హీరోయిన్లకు పెద్దగా ప్రాధాన్యత ఉండదని మలయాళ బ్యూటీ మాళవికా మోహనన్ అభిప్రాయపడ్డారు. విజయ్ నటించిన 'మాస్టర్' మూవీతో తమిళంలోకి హీరోయిన్‌గా అడుగుపెట్టిన ఆమె... ఆ తర్వాత ధనుష్, చియాన్ విక్రమ్ వంటి హీరోల సరసన నటించారు. తమిళంలో ఆమె నటించిన చివరి చిత్రం 'తంగలాన్' కాగా, కార్తీ 'సర్దార్-2'లో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం తెలుగులో ప్రభాస్ సరసన 'రాజాసాబ్' సినిమాలో నటించారు. ఈ నేపథ్యంలో ఆమె మాట్లాడుతూ, 'సాధారణంగా పెద్ద హీరోల చిత్రాల్లో హీరోయిన్లకు ప్రాధాన్యత ఉండదు. ఒక పాట, ఐదారు సన్నివేశాలు మాత్రమే ఉంటాయి. కానీ, 'రాజాసాబ్'తో పాటు నేను నటించిన చిత్రాల్లో మంచి పాత్ర లభించింది.. ఈ విషయంలో నేను ఎంతో అదృష్టవంతురాలిని' అని పేర్కొన్నారు.

సోనియా అగర్వాల్ ప్రధాన పాత్రలో కొత్త చిత్రం

సీనియర్ నటి సోనియా అగర్వాల్ ప్రధాన పాత్రలో మరో కొత్త చిత్రం తెరకెక్కనుంది. మాజీ ఆర్మీ ఆఫీసర్ లోకేశ్వరన్ నిర్మాతగా బయోవన్ క్రియేషనిజం పతాకంపై తెరకెక్కే ఈ చిత్రానికి కేఎస్ కిషన్ దర్శకుడు. హార్రర్ థ్రిల్లర్ మూవీగా రూపొందనున్న ఈ మూవీలో సోనియా అగర్వాల్‌తో సహా జీవిత లివింగ్‌స్టన్, 'అయలి' ఫేం మదన్, ఆదర్శ్, లివింగ్‌స్టన్, విజే విజయ్, కృతిక తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సినిమా ప్రారంభోత్సవ పూజా కార్యక్రమం నగరంలో జరిగింది. వచ్చే నెలలో సెట్స్‌పైకి తీసుకెళ్ళనున్నారు. గోబిశెట్టిపాళెయంలో షూటింగ్ ప్రారంభించి ఆ తర్వాత చెన్నై, పుదుచ్చేరి తదితర ప్రాంతాల్లో సింగిల్ షెడ్యూల్‌లో చిత్రీకరణపనులు పూర్తి చేయనున్నట్టు దర్శక నిర్మాతలు వెల్లడించారు.



కొత్త మూవీ ప్రారంభోత్సవంలో చిత్ర బృందం



వాస్తవ సంఘటనలతో 'ప్రామిస్'

అరుణ్ కుమార్ శేఖర్ హీరోగా కొత్త నటి నదియా సోము హీరోయిన్‌గా వాస్తవ సంఘటనలతో 'ప్రామిస్' పేరుతో ఓ చిత్రం రూపుదిద్దుకుంది. ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ దర్శక నటుడు చేరన్, నట్టి నటరాజ్ తాజాగా విడుదల చేశారు. ఈ చిత్రానికి అరుణ్ కుమార్ శేఖరన్ దర్శకత్వం వహించారు. ఇతర పాత్రల్లో సుజన్, అమ్రిష్, ప్రతాప్, గోకుల్, సుందరవేల్, రాజ్‌కుమార్, కలైవాణి తదితరులు నటించారు. సంఘమిత్రన్ ప్రొడక్షన్, అమ్మన్ ఆర్ట్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఈ సినిమా గురించి దర్శక హీరో అరుణ్ కుమార్ శేఖర్ మాట్లాడుతూ, 'సినిమాలోనే కాకుండా వాస్తవిక ప్రపంచంలో ప్రామిస్ (వాగ్దానం) ఎంత విలువైనదో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇతరులకు ఇచ్చే వాగ్దానం కంటే తల్లికి ఇచ్చే వాగ్దానం ఎంతో ముఖ్యం. ఈ సినిమాలో భార్యాభర్తలు, ప్రేమికుల మధ్య చేసిన ప్రామిస్‌లు కూడా చాలా విలువైనదని చూపించాం. చిత్రీకరణ పనులు వేలూరు, రాణిపేట, ఆర్కాట్, గుడియాత్తం, వాణియంబాడి, పిచ్చావరం, కడలూరు తదితర ప్రాంతాల్లో నిర్వహించాం. యదార్థ సంఘటన ఆధారంగా రూపొందించాం. ఉత్కంఠభరితమైన కథతోపాటు భావోద్వేగ విషయాలు కూడా ఉన్నాయి. చిత్రీకరణ పూర్తయింది, పోస్ట్ ప్రొడక్షన్ పనులు సాగుతున్నాయి. త్వరలోనే ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసిన చేరన్, నట్టి నటరాజ్‌లు చిత్ర బృందాన్ని అభినందించారు'

ఆధ్యాత్మికం


ఆలయ ప్రవేశ ద్వారం

బ్రహ్మకు వేదాలను బోధించిన క్షేత్రం



తిరునారాయణపురం పెరుమాళ్ ఆలయం

● చతుర్వేద తల్పంపై శయనించే వేదనారాయణుడు

టి.నగర్, ఆంధ్రజ్యోతి

తిరుచ్చి సమీపం తిరునారాయణపురం గ్రామంలో అత్యంత ప్రాచీనమైన వేదనారాయణ పెరుమాళ్ ఆలయం ఉంది. చతుర్వేదాలను తల్పంగా చేసుకుని దానిపై శయనించిన పెరుమాళ్ భక్తులకు దర్శనమిస్తున్నారు. స్వామివారి పాదాల చెంత ప్రహ్లాదుడున్నాడు. ఈ ఆలయంలో నరసింహస్వామివారు శాంత స్వరూపుడై భక్తులకు దర్శనమివ్వటం విశేషం. ఓ పర్యాయం బ్రహ్మదేవుడు సృష్టి కార్య నిర్వహణ పదవి కోల్పోయి కొంత కాలం తర్వాత మళ్ళీ సృష్టి కార్యాన్ని నిర్వహించే పనులు ప్రారంభించి, తనకు వేదాలను ఉపదేశించమని పెరుమాళ్‌ను వేడుకున్నారు. పెరుమాళ్ ఈ క్షేత్రంలోనే బ్రహ్మదేవుడికి సులువుగా అర్థమయ్యేలా వేదాలను బోధించి అలసిపోయి శయనించారు. ఈ కారణంగా ఇక్కడి స్వామివారికి 'వేదనారాయణుడు' అనే పేరొచ్చింది. కాలగమనంలో ఇక్కడి స్వామివారి విగ్రహం భూమి లోపలకు వెళ్ళింది. ఒకనాడు ఈ ఊరిలో బసచేసిన వానవరాయర్ అనే రాజుకు ఈ స్వామివారు కలలో కనిపించి, తాను మట్టిలో పూడుకుపోయానని, బయటకు తీసి పూజలు నిర్వహించమని ఆదేశించారు. ఆ రాజు తన సైనికులను పిలిపించి అక్కడ తవ్వకాలు జరిపి భూమిలోపల ఉన్న వేదనారాయణుడి విగ్రహాన్ని వెలికి తీసి, అక్కడే అందమైన ఓ ఆలయాన్ని నిర్మించాడు.


ఆలయ గోపురం


గర్భాలయ గోపురం

ఆలయ విశేషాలు...

ఈ ఆలయంలో ఏడాది పొడవునా ఉత్సవాలు జరుగుతాయి. వాటిలో తమిళమాసమైన వైఖాసిలో ఏకాదశ ఉత్సవాలు, 9 రోజుల రథోత్సవాలు, నవరాత్రి సందర్భంగా 21 రోజులపాటు అధ్యాన ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఆంగ్ల సంవత్సరాది, పొంగల్, వైకుంఠ ఏకాదశి వేడుకలు కూడా జరుగుతాయి.


శయనభంగిమలో దర్శనమిస్తున్న వేదనారాయణ పెరుమాళ్

శాంతస్వరూప నరసింహుడు...

హిరణ్యకశిపుడిని వధించిన తర్వాత ఉగ్రరూపంతో దర్శనమిచ్చిన నరసింహస్వామి, తన భక్తుడైన ప్రహ్లాదుడికి ఈ క్షేత్రం వద్దే శాంత స్వరూపుడిగా దర్శనమిచ్చినట్లు స్థలపురాణం చెబుతోంది. ఈ ఆలయంలోని స్వామివారి పాదాల చెంత మూడేళ్ళ బాలుడి రూపంలో ప్రహ్లాదుడు ఉన్నాడు. ఆలయంలో స్వామివారు చతుర్వేదాలను తన తల్పంగా చేసుకుని, ఆదిశేషుడిపై పవళించి, నాభికమలంలో ఉన్న బ్రహ్మదేవుడికి వేదాలను ఉపదేశిస్తున్నారు. పెరుమాళ్ తిరువడి వద్ద ఇష్టదేవేరులు శ్రీదేవి, భూదేవి కొలువుదీరారు. మూలవర్ల గర్భాలయంపై ఉన్న విమానానాన్ని 'వేద విమానం' అని పిలుస్తున్నారు. కావేరినదీ తీరంలో ఉత్తర దిశలో నిర్మితమై ఉన్న ఈ ఆలయం ఎదురుగా ఉన్న స్థలంలో కంబత్తడి ఆంజనేయస్వామి భక్తులను అనుగ్రహిస్తున్నారు. స్థానికులు తమ మధ్య ఏవైనా సమస్యలు వస్తే వాటిని ఈ స్వామివారి స్తంభం వద్ద చర్చలు జరిపి పరిష్కరించుకోవటం ఆనవాయితీ. ఎవరైనా ఏ విషయంలోనైనా అసత్యమాడినా, మోసగించినా అలాంటివారిని ఈ కంబత్తడి ఆంజనేయస్వామి ఎదుట సత్య ప్రమాణం చేస్తుంటారు. వేదనారాయణ పెరుమాళ్‌ను పూజిస్తే వివాహ ఆటంకాలు తొలగిపోతాయని, విద్యలో ఉన్నతస్థితికి చేరుకుంటారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఎలా వెళ్ళాలి?...

ఈ ఆలయం తిరుచ్చి నగరానికి 50 కిలోమీటర్ల దూరంలో తిరుచ్చి - నామక్కల్ - సేలం హైవేలో తొట్టియం అనే ప్రాంతానికి చేరువలో ఉంది. రాష్ట్రంలోని ప్రముఖ నగరాలనుంచి తిరుచ్చి వెళ్ళేందుకు బస్సులు అందుబాటులో ఉన్నాయి. తిరుచ్చికి రైలులోనూ వెళ్ళవచ్చు. తిరుచ్చిలో దిగిన తర్వాత అక్కడి నుండి మరొక బస్సులో తొట్టియం చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని ఉదయం 7.30 నుండి 11.30 గంటల వరకు,మళ్ళీ సాయంత్రం 4.30 నుండి రాత్రి 8 గంటలవరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.


ఆలయ ముఖమండపం

రాధాకృష్ణులకు పవిత్రాల సమర్పణ


పవిత్రోత్సవంలో మండలి సభ్యులు

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్ వరదాముత్తియప్పవీధిలోని మద్రాస్ యతిరాజా సేవా మహిళా మండలి ఆధ్వర్యంలో గీతా మందిరం తృతీయ వార్షిక పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. బుధవారం సాయంత్రం 5.30 గంటలకు అంకురార్పణం, పవిత్రా శుద్ధి, సమర్పణ పూజలను సంతాన భట్టర్ బృందం నేతృత్వంలోని రుత్వికుల బృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురువారం పవిత్రాల సమర్పణ సందర్భంగా రాధాకృష్ణులు, భగవత్ రామానుజులు, ఆళ్వారులు, ఉత్సవమూర్తులు, ధ్వజస్తంభం, దేవతా సన్నిధులకు పవిత్ర మాలలు సమర్పించారు. మండలి అధ్యక్షురాలు తవ్వా విజయలక్ష్మి, కార్యదర్శి ఉషా గణేష్, కోశాధికారి కె.శాంతకుమారి, కమిటీ నిర్వాహకులు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులందరికీ తీర్థప్రసాదాలు, పవిత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయలక్ష్మి మాట్లాడుతూ, మద్రాస్ యతిరాజా సేవా మహిళా మండలి 75యేళ్ల చరిత్రలో తొలిసారిగా డిసెంబరు 10న లక్ష తులసీ అర్చన నిర్వహిస్తున్నామన్నారు.


అవార్డు గ్రహీతలతో ముఖ్యమంత్రి

బాలల సంక్షేమ సేవా అవార్డుల ప్రదానోత్సవం

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాంఘిక సంక్షేమం, మహిళా హక్కుల విభాగాల్లో 2025వ సంవత్సరంలో సమర్థవంతంగా సేవలందించిన సంస్థలకు సచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ 'బాలల సంక్షేమ సేవా అవార్డు'లను అందజేసి అభినందించారు. సాంఘిక సంక్షేమం, మహిళా హక్కుల విభాగాల్ల బాలలు, మహిళా రక్షణ కోసం అంకిత భావంతో సేవలందించిన సంస్థలను ఎంపిక చేసి ప్రతిఏటా బాలల సంక్షేమ సేవా అవార్డులను అందజేయడం ఆనవాయితీ. ఆ రీతిలో ఈ సంవత్సరానికి ఎంపికైన తంజావూరులోని అనైసత్య స్మారక ప్రభుత్వ బాలల సంరక్షణ కేంద్రం, తూత్తుకుడి సెయింట్ మేరీ కరుణైఇళ్లం, చెన్నై ప్రభుత్వ బాలల సంరక్షణ గృహం, రామనాథపురం జిల్లాలోని పిల్లల బ్యాంకు ప్రతినిధులకు అవార్డులతో పాటు తలా రూ.లక్ష చెక్కును సీఎం స్టాలిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక సంక్షేమం, మహిళా హక్కులశాఖ మంత్రి గీతా జీవన్, ఆ శాఖ కార్యదర్శి జయశ్రీ మురళీధరన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎం.మురుగానందం, పిల్లల సంక్షేమ ప్రత్యేక సేవలశాఖ డైరెక్టర్లు శిల్పా ప్రభాకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలకూ 'లాంకర్' విస్తరణ


మీడియా సమావేశంలో లాంకర్ సంస్థ నిర్వాహకులు

చెన్నై, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణంలో పేరొందిన లాంకర్ సంస్థ నగర శివారు ప్రాంతాల్లో సీనియర్ సిటిజెన్లకు అన్ని హంగులతో 'లాంకర్ హార్మోనియా పెవిలియన్' పేరుతో గృహసముదాయాలను నిర్మించనున్నట్లు ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్, సంస్థ సీఈఓ జేఎం చంద్రశేఖర్ తెలిపారు. నగరంలో గురువారం మధ్యాహ్నం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీపెరుంబుదూరులో లాంకర్ హార్మోనియా పెవిలియన్‌లో వృద్ధుల కోసం 110 అపార్ట్‌మెంట్లు కలిగిన భవన సముదాయాన్ని నిర్మించినట్లు తెలిపారు. అక్కడ ప్లాట్లలో నివసిస్తున్నవారికి మూడుపూటలా ఆరోగ్యవంతమైన ఆహార పదార్థాలను సమకూర్చుతున్నామని, ఈతకొలను, క్రీడా మైదానాలు తదితర వసతులు కూడా కల్పించినట్లు వివరించారు. 816 చదరపుటడుగులు, 993 చదరపుటడుగుల విస్తీర్ణం కలిగిన లాంకర్ పెవిలియన్‌లను మరిన్ని చోట్ల నిర్మించే యోచన కూడా ఉందన్నారు. ఈ సమావేశంలో సంస్థ ఛైర్మన్ ఆర్వీ శేఖర్, స్పెషల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వీకే అశోక్, సంస్థ బ్రాండ్ అంబాసిడర్ సీనియర్ నటి రేవతి తదితరులు పాల్గొన్నారు.

టీసీఈతో జపాన్ సంస్థల ఒప్పందం


ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న జపాన్ సంస్థ ప్రతినిధులు

చెన్నై, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మదురైలోని త్యాగరాజ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌తో జపాన్‌కు చెందిన ఆల్ఫాటీకేజీ కంపెనీ, ఓహ్‌కుమా ఇండస్ట్రీస్ ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ మూడు సంస్థలు కలిసి షాప్‌ఫ్లోర్‌లో త్రీడీ ఉత్పత్తులకు సంబంధించి పారిశ్రామిక ప్రాజెక్టులను చేపట్టనున్నాయని ఆ కళాశాల ఛైర్మన్ హరి త్యాగరాజన్ తెలిపారు. నగరంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం ద్వారా ఉత్పత్తుల్లో ఏఐ (కృత్రిమ మేథోపరిజ్ఞానం) ఆధారిత ఆవిష్కరణలు, నాణ్యత నిర్వహణల పెంపు, అమ్మకాల అంచనాల మెరుగవుతాయి. కొత్త పరిశోధనల ఆవిష్కరణకు కూడా ఈ ఒప్పందాలు దోహదపడతాయన్నారు. ఈ ఒప్పంద పత్రాలపై జపాన్ సంస్థల ప్రతినిధులు తోషియో టకాగీ, కట్సుషి కొబొరీ సంతకాలు చేశారు.

జనవరి 28న మన్నార్‌గుడి రాజగోపాలస్వామి ఆలయ కుంభాభిషేకం

● ఘనంగా స్తంభస్థాపన పూజలు


స్తంభస్థాపన పూజల్లో ఆలయ అర్చకులు

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా మన్నార్‌గుడి రాజగోపాలస్వామి ఆలయ కుంభాభిషేకం 12యేళ్ల అనంతరం జనవరి 28న ఘనంగా జరుగనుంది. ఈ సందర్భంగా గురువారం ఉదయం స్తంభస్థాపన పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. 2010లో కుంభాభిషేకం నిర్వహించిన ఈ ఆలయానికి 12యేళ్ల అనంతరం మళ్లీ ఈ కార్యక్రమం నిర్వహించాల్సివుండగా, కరోనా లాక్‌డౌన్ వల్ల వాయిదా వేశారు. ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి టీఆర్బీ రాజా కృషితో రాష్ట్రప్రభుత్వం ఈ ఆలయ జీర్ణోద్ధరణ పనులకు రూ.2.87కోట్లు కేటాయించింది. దీంతో గత ఏడాది జూలై బాలాలయంతో ప్రారంభించిన జీర్ణోద్ధరణ పనులు దాదాపు 98 శాతం మేరకు పూర్తయ్యాయి. స్తంభస్థాపన పూజలో హిందూ దేవాదాయశాఖ అధికారులు, నాగపట్నం డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాణి, మన్నార్‌గుడి డీఆర్వో మాధవన్, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

3న శ్రీరంగంలో కార్తిక దీపోత్సవం

● వైభవంగా స్తంభస్థాపన పూజలు

ప్యారీస్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా శ్రీరంగంలో భూలోక వైకుంఠంగా విలసిల్లుతున్న రంగనాథస్వామి ఆలయం కార్తిక దీపోత్సవాలకు ముస్తాబవుతోంది. డిసెంబరు 3వ తేదీన కార్తిక మహాదీపోత్సవం నిర్వహించనున్న సందర్భంగా గురువారం స్తంభస్థాపన పూజలను ఆలయ పండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు ఆలయ ప్రధాన ప్రవేశద్వారం ముందు ఎండిన కొబ్బరి మట్టలపై నెయ్యిపోసి దహనం చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం శుభలగ్నంలో సుమారు 20 అడుగుల ఎత్తయిన టెంకాయ మానుకు పూలు చుట్టి, గంధం పూసి మామిడి తోరణాలు కట్టి స్తంభస్తాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వైభవంలో ఆలయ ఏనుగులు ఆండాళ్, లక్ష్మీలను సత్కరించారు. కార్తిక దీపోత్సవం రోజున నంబెరుమాళ్ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పిచడం శ్రీరంగంలో విశేషం.


పూజా కార్యక్రమంలో నిర్వాహకులు, అర్చకులు





పల్లకీలో పద్మావతి

● వేడుకగా మహంతు ఉత్సవం

తిరుచానూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారు గురువారం సాయంత్రం పల్లకిలో ఊరేగారు. కార్తీక బ్రహ్మోత్సవాలు ముగిసిన రెండో రోజు అమ్మవారు తన పుట్టింటికి వెళ్లి ఆతిథ్యం స్వీకరించడం ఆనవాయితీ. ఈ మహంతు ఉత్సవంలో భాగంగా అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని పద్మసరోవరం వద్దనున్న హథీరాంజీమఠంలోని ఆంజనేయస్వామి ఆలయం ప్రాంగణానికి వేంచేపు చేశారు. హథీరాం మఠం తరపున దేవదాయశాఖ అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అభిషేకం నిర్వహించారు. సర్వాలంకార శోభితురాలైన పద్మావతిదేవి పల్లకిలో కొలువుదీరి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. హథీరాంజీ మఠం పర్యవేక్షణాధికారి బాపిరెడ్డి, అమ్మవారి ఆలయ అధికారులు చలపతి, సుభాస్కర్‌నాయుడు, అర్చకులు పాల్గొన్నారు.


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,670

తలనీలాలు సమర్పించినవారు: 26,062



సాహిత్యంతో మహిళల్లో నాయకత్వ శక్తి

● ఉస్మానియా వర్సిటీ తెలుగు ప్రొఫెసర్ కాశీం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాహిత్యంతో ఎందరో రచయితలు మహిళల్లో నాయకత్వ పటిమను రగిలించారని హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం అభిప్రాయపడ్డారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో గురువారం నిర్వహించిన పోపూరి వేంకట సుబ్బారావు స్మారక ధర్మనిధి సదస్సులో ఆయన 'ఆధునిక సాహిత్యంలో స్త్రీ నాయకత్వ పటిమ- కవిత్వం, నాటకం'పై ప్రసంగించారు. మహిళల జీవితంలోని అనేక సమస్యలను గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' నాటకంలోనూ, కాళ్ళకూరి నారాయణరావు 'వరవిక్రయం' నాటకంలోనూ, శివసాగర్ 'చెల్లీ చెంద్రమ్మ' కవిత, గద్దర్ 'సిరిమల్లె చెట్టుకింద లచ్చుమమ్మో లచ్చుమమ్మో' పాటలోనూ కనిపిస్తుందన్నారు. ఈ రచనల్లో రచయితలు కేవలం సమస్యలను వివరించడంతో సరిపెట్టుకోకుండా పరిష్కారాలనూ సూచించారన్నారు. తద్వారా మహిళల్లో నాయకత్వ పటిమను, పోరాట స్ఫూర్తిని రగిలించే ప్రయత్నం చేశారని అభిప్రాయపడ్డారు. 'ఆధునిక సాహిత్యంలో స్త్రీ నాయకత్వ పటిమ - కథ, నవల' అంశంపై కడప యోగి వేమన వర్సిటీ తెలుగు ప్రొఫెసర్ ఎంఎం వినోదిని ప్రసంగించారు. మహిళలను మంచి మార్గంలో నడిపించేదే గొప్ప సాహిత్యమని పేర్కొన్నారు. మహిళల్లో నాయకత్వ పటిమ అంటే నలుగురిని వెంట నిలబెట్టుకోవడం మాత్రమే కాదనీ, విపత్కర పరిస్థితుల్లో మనోనిబ్బరంతో నిలదొక్కుకోవడమని చెప్పారు. ఓల్గా, యద్దనపూడి సులోచనా రాణి, వాసిరెడ్డి సీతాదేవి వంటి వారి రచనలు చదవడం వల్ల మహిళలు చైతన్యం పొందవచ్చని పద్మావతి వర్సిటీ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ వాణి సూచించారు. నలుగురిని నడిపించడమే కాదు.. నాయకురాలిగా అందరినీ కలుపుగోలుగా ఒకే పథం వైపు నడిపించడం నాయకురాలి మౌలిక లక్షణమని తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి తెలిపారు. ఈ ధర్మనిధి సదస్సుకు ఆర్థిక సహకారాన్ని అందించిన రచయిత్రి ఓల్గాకు సదస్సు సంచాలకుడు డాక్టర్ యువశ్రీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సు సందర్భంగా చేపట్టిన వ్యాస రచన పోటీలకు డాక్టర్ సుభాషిణి, డాక్టర్ కృష్ణవేణి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రచయిత ఆర్సీ కృష్ణస్వామిరాజు, సాహిత్యవేత్తలు, డాక్టర్ లక్ష్మీప్రియ, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీలో విజేతకు బహుమతి అందజేస్తున్న అతిథులు

గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గూడూరును రాష్ట్రప్రభుత్వం జిల్లా కేంద్రంగా ప్రకటించాలని గూడూరు ప్రజాసమితి నాయకుడు కోడూరు మీరారెడ్డి డిమాండు చేశారు. అన్నారు. గురువారం జరిగిన గూడూరు ప్రజాసమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. గూడూరును జిల్లా చేసేందుకు అసరమైన భౌగోళిక మౌలిక వసతులు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా రెవెన్యూడివిజన్‌కి కేంద్రంగా ఉందన్నారు. ఇక్కడ నుంచి మైకా, నిమ్మకాయలు విదేశాలకు ఎగుమతులు చేస్తుండడంతో గూడూరుకు గుర్తింపు ఉందన్నారు. రైల్వేజంక్షన్, పరిశ్రమలు, సముద్ర తీరం.. ఇలా అన్ని వనరులున్న గూడూరును జిల్లా కేంద్రంగా చేసుకునేందుకు జరపనున్న పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఎన్నో ఏళ్లుగా నెల్లూరుజిల్లాతో అనుబంధమున్న గూడూరును తిరుపతిజిల్లాలో కలపడంతో జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు నియోజకవర్గ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు గూడూరును నెల్లూరుజిల్లాలో కలపాలని కోరారు. లేదంటే ప్రజాసమితి అధ్వర్యంలో మొదటగా పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించి.. దశలవారీగా ఉధ్రుతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్‌రెడ్డి, చంద్రశేఖరయ్య, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గూడూరు ప్రజాసమితి నాయకుడు కోడూరు మీరారెడ్డి

నేడు విద్యాసంస్థల బంద్: ఏఎస్ఎఫ్

గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ శుక్రవారం నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని అంబేడ్కర్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఎస్ఎఫ్) నేత షఫీహరన్, శ్యామ్‌కుమార్ గురువారం కోరారు. తిరుపతి జిల్లాలోని గూడూరును నెల్లూరులో కలుపుతామన్న హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చాలన్నారు.

సుందరకాండ పారాయణానికి అంకురార్పణ

తిరుమల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం నుంచి డిసెంబరు 13వ తేదీ వరకు జరుగనున్న షోడశదిన సుందరకాండ పారాయణానికి ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో గురువారం సాయంత్రం అంకుర్పాణ జరిగింది. ఇందులో భాగంగా పుణ్యాహవచనం, రక్షాబంధనం, మత్స్యంగ్రహణాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ప్రతి రోజు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు వసంతమండపంలో సుందరకాండ పారాయణం, ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరాధన, అభిషేకం, హోమం, అనుష్ఠానం నిర్వహిస్తారు. డిసెంబరు 13న పూర్ణాహుతితో ఈ కార్యక్రమం ముగియనుంది. అంకురార్పణ కార్యక్రమంలో వేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ ఎస్ఎస్ అవధాని, వేదపండితులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని టీడీపీ నాయకుడి మృతి


బాబు (ఫైల్‌ఫొటో)

బాలాయపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని టీడీపీ నాయకుడు మృతిచెందిన సంఘటన గురువారం గూడూరు రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వేజీఆర్ పోలీసుల కథనం మేరకు.. బాలాయపల్లి మండలం వ్యాఖ్యం గ్రామానికి చెందిన నర్రావుల బాబు(49) గురువారం ఉదయం ఇంటి వద్ద నుంచి పనుల నిమిత్తం గూడూరుకు వెళ్లారు. గూడూరులోని రెండో ప్లాట్‌ఫాం సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా చెన్నై నుంచి విజయవాడ వైపు వెళుతున్న గుర్తుతెలియని రైలు ఢీకొంది. దీంతో బాబు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. రైల్వే జీఆర్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈయన వ్యాక్యం గ్రామంలో టీడీపీ గ్రామస్థాయి నాయుకుడిగా కొనసాగుతున్నాడు. బాబు మృతి టీడీపీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాయి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడులు తెలిపారు. బాబు మృతిచెందడంపై పలువురు టీడీపీ నాయకులు సంతాపం తెలియజేశారు.

ఆక్వా బకాయిలు రూ.9 కోట్లు


సదరన్ డిస్కం కార్యాలయ భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న డిస్కం ఈఈ కేవీ నరేంద్రరెడ్డి

కోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గూడూరు డివిజన్‌లో ఆక్వా బకాయిలు 9 కోట్లు వసూలు కావాల్సి ఉందని దీనిపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని సదరన్ డిస్కం ఈఈ కేవీ నరేంద్రరెడ్డి అన్నారు. కోట మండలం చెందోడు విద్యుత్ సబ్ స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. సబ్ డివిజన్‌లోని పలు ఏఈలు, సబ్ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తీర ప్రాంత మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలలో ఆక్వా బకాయిలు పేరుకుపోయి ఉన్నాయన్నారు. 2600 ఆక్వా సర్వీసులు బకాయి ఉన్నాయన్నారు. వీటిపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి వసూళ్లకు చర్యలు చేపడుతామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటి సర్వీసుల విద్యుత్ బిల్లులపైనా ఈ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామ న్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిన్నయ్య, పలువురు ఏఈలు ఉన్నారు. అంతకుముందు ఆయన నూతన సబ్ స్టేషన్ కోసం స్థల పరిశీలన చేశారు.

పరిశ్రమ నిర్వాహకుల్లో ఉత్తేజానికి 'కైజాన్'



విజేతలుగా నిలిచిన వారితో పరిశ్రమల నిర్వాహకులు

తిరుపతి(వైద్యం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నిర్వాహకుల్లో నూతన ఉత్తేజాన్ని నింపడంతోపాటు కొత్త ఆలోచనలు పంచుకోవడానికి 'కైజాన్' వంటి పోటీలు ఉపయోగపడతాయని సీఐఐ తిరుపతి వైస్‌చైర్మన్ ఎస్పీ రాజేంద్రన్ అన్నారు. తిరుపతిలో గురువారం సీఐఐ రాష్ట్ర స్థాయి కైజాన్ రెండవ ఎడిషన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో భాగంగా నిర్వహించిన ఆపరేషన్స్ కేటగిరిలో మొదటి స్థానంలో అర్జాస్ స్టీల్స్ ప్రవేట్ లిమిటెడ్, ద్వితీయ స్థానంలో అపోలో టైర్స్, తృతీయ స్థానంలో ఐటీసీ లిమిటెడ్ నిలిచాయి. అలాగే సూపర్‌వైజర్ల స్థానంలో అపోలో టైర్స్, సుందరం ఫాస్నర్స్ లిమిటెడ్, కెల్లాగ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 20కు పైగా జట్లు పాల్గొన్నాయని రాజేంద్రన్ తెలిపారు. వీరి ఆలోచనలు ఒకరికి ఒకరు పంచుకోవడం కోసమే ఇటువంటి పోటీలను నిర్వహించామని, వీటిని ప్రోత్సాహంగానే భావించాల్సిన అవసరం ఉందన్నారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్యూసీపీఐ హైదారాబాద్ ఛాప్టర్ అధ్యాపకులు హనుమంతరావు, టీవీ కృష్ణారావు, డిక్సన్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఏజీఎం శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తడ రైల్వేస్టేషన్‌కు మహర్దశ

● గూడ్స్ షెడ్, ఎగుమతుల కేంద్రం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ● పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు సుముఖం




తడ రైల్వే స్టేషన్ - గూడ్స్‌షెడ్ నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలం

తడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తడ రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. గూడ్స్‌షెడ్ నిర్మాణంతో పాటు ఎగుమతుల కేంద్రం ఏర్పాటుకు రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. తడ... 2007కు ముందు వరకు ఓ మారుమూల కుగ్రామం. 2008లో శ్రీసిటీ, మాంబట్టు సెజ్ ఏర్పాటుతో అభివృద్ధికి అడుగులు పడ్డాయి. రెండు సెజ్‌లలో సుమారు 220కి పైగా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. దీంతో ఒకప్పటి మారుమూల పల్లెటూరైన తడ నగరాలకు దీటుగా అభివృద్ధిలో దూసుకుపోతోంది. ఇప్పుడు రైల్వేశాఖ తనవంతు పాత్ర పోషించేందుకు సిద్ధమవుతోంది. తడ రైల్వేస్టేషన్‌లో ఒకప్పుడు ప్యాసింజర్ రైళ్లు ఆగేదే ఎక్కువ. సెజ్‌ల ఏర్పాటుతో 2010 నుంచి చెన్నై, సూళ్లూరుపేట మధ్య లోకల్ రైళ్లను ప్రవేశపెట్టారు. 2015లో అప్పటి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు చొరవతో ఇక్కడ నుంచి నేరుగా నెల్లూరుకు మెమూ రైళ్లను ప్రవేశపెట్టడంతో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రస్తుతం నెల్లూరు, సూళ్లూరుపేట, చెన్నైకు 25 లోకల్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ క్రమంలో శ్రీసిటీ, మాంబట్టు సెజ్‌లోని పరిశ్రమల ఉత్పత్తులను రవాణా చేసేందుకు తడ రైల్వే స్టేషన్‌లోనే ఎగుమతుల కేంద్రానికి శ్రీసిటీ యాజమాన్యం ప్రయత్నాలు చేసింది. ఇప్పటికే కొబెల్‌కో పరిశ్రమ తయారు చేసే ఎక్సకవేటర్లను గూడ్స్‌లలో రవాణా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గూడ్స్ షెడ్‌తో పాటు ఎగుమతుల కేంద్రాన్ని ఏర్పాటు చేసే దిశగా సదరన్ రైల్వే అధికారులు నిమగ్నమయ్యారు. ఇందు కోసం ఇప్పటికే రైల్వేశాఖ పరిధిలో ఉన్న భూములతో పాటు మరో 25 ఎకరాలు సేకరించేందుకు రెవెన్యూ అధికారులను సంప్రదించినట్లుగా తెలిసింది. దొరవారిసత్రం రైల్వేస్టేషన్ నుంచి బియ్యాన్ని వివిధ ప్రాంతాలకు సరఫరా చేసే పాయింట్‌ను సైతం తడకు తరలిస్తున్నారు. వీటితో పాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తడ రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి.

'శెట్టిపల్లె' లబ్ధిదారులకు త్వరలో ప్లాట్ల కేటాయింపు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ శెట్టిపల్లె లేఅవుట్ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఇన్‌చార్జి జేసీ మౌర్య, తుడాచైర్మన్ దివాకరరెడ్డి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, తుడా భూసేకరణ అధికారి సుజన తదితరులతో ఆయన సమావేశమయ్యారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్, పార్కులు వంటి సదుపాయాలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వసతిగృహాలకు మరమ్మతులు పూర్తి చేయండి

జిల్లాలోని హాస్టళ్లలో మరమ్మతు పనులు వేగవంతంచేయాలని గురువారం జరిగిన సమీక్షలో అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంతలోపు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆయా శాఖల అధికారులు విక్రమ్ కుమార్‌రెడ్డి, భరత్‌రెడ్డి, రాజా సోము, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

నూతన పోలింగ్ కేంద్రాలకు బీఎల్వోలను నియమిస్తాం

జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు బీఎల్వోలను నియమిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. విజయవాడ నుంచి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్‌యాదవ్ గురువారం ఓటర్ మ్యాపింగ్, స్పెషల్ ఇంటిన్సివ్ రివిజన్-2026 కార్యక్రమాలపై వర్చువల్ విధానంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల అధికారులకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై శిక్షణా కార్యక్రమం ముగిసిందన్నారు. ఓటర్ మ్యాపింగ్ కూడా పూర్తికావచ్చిందని, బీఎల్వోలకు ఐడీ కార్డులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు సుధారాణి, రోజ్మాండ్, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● 20 దుంగలు స్వాధీనం



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం మామండూరు అటవీ ప్రాంతంలో గురువారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఇద్దరుస్మగ్లర్లను అరెస్టు చేసి 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైల్వేకోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ అల్లీబాషా బృందం, ఫారెస్టు బీట్ ఆఫీసర్ జాన్ శ్యాముల్‌తో కలిసి మామండూరు అటవీప్రాంతంలో బుధవారం నుంచి కూంబింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారుజామున కాకిరేవులపెంట వద్ద ఇద్దరు వ్యక్తులు టాస్క్‌ఫోర్సు సిబ్బందిని గమనించి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకోగా.. మామండూరుకు చెందిన వారుగా గుర్తించారు. వారిని విచారించి.. దాచి ఉన్న 20 ఎర్రచందనం దుంగలను గుర్తించారు. వారితో పాటు దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌పై కేసు కొట్టేయడం శుభపరిణామం


న్యాయదేవత, సీఎం చంద్రబాబు ఫొటోకు పాలాభిషేకం

తిరుపతి(జీవకోన), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌పై గతంలో జగన్ ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసును కొట్టివేయడం శుభపరిణామమని ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుబాబు, నగర అధ్యక్షుడు జేడబ్ల్యూ విజయకుమార్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం వీరు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చేలా ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌ను చంద్రబాబు తీసుకొచ్చారన్నారు. ఈ ఫైబర్ నెట్ ద్వారా వేలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందారన్నారు. దీనిని ఓర్వలేని జగన్ ప్రభుత్వం అక్రమ కేసును బనాయించడంతో వేలాది ఆపరేటర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై పోరాటం చేయడంతో న్యాయస్థానం ఆ కేసును కొట్టేసిందన్నారు. ఏపీ ఫైబర్ నెట్‌కు పూర్వవైభవం వచ్చేలా సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తారని మళ్లీవేలాది ఆపరేటర్ల కుటుంబాల్లో వెలుగులు నింపుతారన్నారు. ఈ సందర్భంగా న్యాయదేవత, చంద్రబాబు చిత్రాలకు పాలాభిషేకం చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నేతలు ఆనంద్, శంకర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జనవరిలో పలు ప్రధాన రైళ్లు రద్దు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గోదావరి-రాజమండ్రి, రాజమండ్రి-కడియం సెక్షన్లలో ఆధునికీకరణ నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో జనవరిలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.పవన్ కుమార్ తెలిపారు. జనవరి 27న తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ (17480), 28న పూరి-తిరుపతి (17479), తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ (22708); 28, 29 తేదీల్లో విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805), మచిలిపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219); 29న విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707), 29, 30 తేదీల్లో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806), విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), 28, 30 తేదీల్లో గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), 29, 31 తేదీల్లో విజయవాడ-విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718), విశాఖపట్నం-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము పాసింజర్ (67286), జనవరి 31న గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876), విశాఖ-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22575) రద్దు కానున్నట్టు పేర్కొన్నారు.

రైల్వే డివిజన్ కోసం సీఎం దృష్టికి తీసుకెళ్తా

● సాధన సమితి సభ్యులతో కలెక్టర్



తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ ఆవశ్యకతను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి సభ్యులు గురువారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాగా, జనవరిలో సీఎం నారావారిపల్లెకు వస్తున్నారని, ఆయన్ను కలిసే అవకాశం కల్పిస్తానని కలెక్టర్ వారితో చెప్పారు. నగరి, పుత్తూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట ప్రాంతాలను కూడా కొత్తగా ఏర్పడే సౌత్ కోస్తా రైల్వేలో కలిపితే బాగుంటుందని కమిటీ సభ్యులు తెలుపగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అలాగే, మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డికీ వినతిపత్రం ఇచ్చారు. ఈ సమావేశంలో సాధన కమిటీ కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్, సభ్యులు ఎమ్.వేణుగోపాల్ రెడ్డి, సూరిసేని బుజ్జి బాబు నాయుడు, సి.కృష్ణయ్య, అనిల్ కుమార్, నీలేష్, కుమార్, టీవీ రావు పాల్గొన్నారు.